www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

పేదల సంక్షేమానికి పెద్దపీట..



3 లో..

ఎవరు చెప్పినా మేము మారం గాక మారం...

మా స్టైల్ అంతే..



3 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 289, మంగళవారం 17-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

పాత ఇళ్ల పథకాల లబ్ధిదారులకు ఇంటి పట్టాలు తిరిగి ఇవ్వాలని ఆదేశాలు

2014కు ముందు ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఊరట

పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల వాపసుకు కలెక్టర్లకు ఆదేశం

సుమారు 7 లక్షల మందికి ప్రయోజనం

దశాబ్దకాల నిరీక్షణకు తెరదించేందుకు ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 16 :

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2014కు ముందు ఇందిరమ్మ సహా వివిధ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఆయా పథకాల లబ్ధిదారులకు గతంలో జారీ చేసిన ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను తిరిగి అందించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుందని తెలిపారు. లబ్ధిదారులకు సంబంధించిన ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఉండిపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మంత్రి వివరించారు. దాదాపు దశాబ్దానికి పైగా తమ ఇంటి పత్రాలు తిరిగి అందలేదని లబ్ధిదారుల నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తనకు అనేక విజ్ఞాపనలు అందాయని చెప్పారు. ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ప్రభుత్వం,

మిగతా 2 లో..



కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేస్తోంది: హరీశ్‌రావు

- తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చడంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది
- మూడేళ్లలో కొత్త ప్రాజెక్టు నిర్మించలేదని మాజీ మంత్రి విమర్శ
- సిద్దిపేటలో రైతులకు రుణమాఫీ కాని వారి సంఖ్యే అధికమని వెల్లడి
- ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ విడుదల

సిద్దిపేట, నవంబర్ 16



సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును రాజకీయ ప్రయోజనాలు, కమీషన్ల కోసం మార్చారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, ఒక అబద్ధాన్ని పదేపదే చెబితే నిజమవుతుందన్న రీతిలో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలోనే అన్ని ఆధారాలతో సమాధానం ఇచ్చామని, తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని అప్పట్లో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతి, కేంద్ర జల సంఘం లేఖలు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించామని తెలిపారు. నీళ్లు లేని ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మించకుండా, నీటి లభ్యత ఉన్న ప్రాంతానికి మార్చి గత ప్రభుత్వం ప్రజాధనాన్ని సద్వినియోగం చేసిందని పేర్కొన్నారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో పనులు చేయకుండానే బిల్లులు తీసుకుని కమీషన్లు పొందారని హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

మిగతా 2 లో..



దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత సహాయ ఉపకరణాలు: మంత్రి పొన్నం ప్రభాకర్

- హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్ధారణ శిబిరం ప్రారంభం
- అలింకో సంస్థ సహకారంతో ప్రత్యేక కార్యక్రమం
- అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఏర్పాట్లు
- ప్రతి ఒక్కరికీ సహాయ ఉపకరణాలు అందించడమే లక్ష్యం

కరీంనగర్, నవంబర్ 16 : హుస్నాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలో అలింకో సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. అర్హులైన వారిని గుర్తించి వారికి అవసరమైన సహాయ ఉపకరణాలు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. దివ్యాంగులు, వృద్ధులు రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు అవసరమైన పరికరాలను

మిగతా 2 లో..

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- 1,924 మందికి కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు
- 523 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ
- దుబ్బాకకు రెండో విడతలో మరో 2 వేల ఇళ్లు మంజూరు
- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు

సిద్దిపేట, నవంబర్ 16

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.

మిగతా 2 లో..





హరీశ్‌రావు అవినీతి ఆరోపణలపై నిగ్గు తేల్చాలి: కల్వకుంట్ల కవిత

- ప్రజాక్షేత్రంతో పాటు న్యాయపరంగానూ పోరాటం
- ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సీబీసీఐడీ, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు పంపిస్తాం
- కరువు పరిస్థితులపై ప్రధానికి వివరించని సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా త్వరలో భైరవ వాహనంలో యాత్ర

నిజామాబాద్, నవంబర్ 16 : మాజీ మంత్రి హరీశ్‌రావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్

మిగతా 2 లో..

దివ్యాంగుల సేవలో స్వయంకృషి సంస్థ కృషి అభినందనీయం

మేడ్చల్, నవంబర్ 16

- జవహర్‌నగర్‌లో స్వయంకృషి సంస్థను సందర్శించిన సీతక్క
- మూడు దశాబ్దాలుగా లాభాపేక్ష లేకుండా సేవలు



దివ్యాంగులకు మూడు దశాబ్దాలకు పైగా లాభాపేక్ష లేకుండా సేవలందిస్తున్న స్వయంకృషి సంస్థ కృషి అభినందనీయమని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లోని స్వయంకృషి సంస్థను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలను పరిశీలించి, దివ్యాంగులకు అందిస్తున్న సహకారం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇన్నేళ్లుగా దివ్యాంగుల సంక్షేమం కోసం

మిగతా 2 లో..

తెలంగాణ ఉద్యమ పాదయాత్రకు 15 ఏళ్లు

హైదరాబాద్, నవంబర్ 16

- రాష్ట్ర సాధనే లక్ష్యంగా చారిత్రాత్మక అడుగులు
- ఉమ్మడి జిల్లాల వారీగా పాదయాత్రలకు శ్రీకారం
- కేటీఆర్ నాయకత్వంలో రంగారెడ్డి జిల్లాలో యాత్ర



తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిచిన పాదయాత్రలకు నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా 2011 నవంబర్ 16న అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారీగా పాదయాత్రలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఆనాడు చేపట్టిన పాదయాత్రల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సాగిన యాత్ర ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రస్తుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో

మిగతా 2 లో..

కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేస్తోంది: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఆ విధానాన్ని రద్దు చేసి పారదర్శకంగా పనులు చేపట్టిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో, మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఏడేళ్లపాటు ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు తీసుకురాకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ సైతం ప్రాజెక్టుపై ఖర్చు వృథా అవుతుందని లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ చేసిన ఆలస్యాన్ని ప్రస్తావించకుండా ఇప్పుడు బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వేలాది చెక్‌డ్యామ్‌లు, ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు చెరువుల పునరుద్ధరణ చేపట్టి లక్షల ఎకరాలకు సాగునీరు అందించిందని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో కొత్తగా ఒక్క ప్రాజెక్టు నిర్మించిందా, కొత్తగా ఒక్క ఎకరానికి నీరు అందించిందా, ఒక్క చెరువైనా తవ్వించిందా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించింది శూన్యమని విమర్శించారు. దేవాదుల, కాళేశ్వరం, సీతమ్మ సాగర్, సమ్మక్క బ్యారేజీ, పాలమూరు ప్రాజెక్టులు పూర్తయి ఉంటే కరువును ఎదుర్కొనే సామర్థ్యం రాష్ట్రానికి ఉండేదన్నారు. కృష్ణా జలాలను వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, మూడేళ్ల లోనే అత్యల్పంగా నీటిని ఎత్తిపోసిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. వానాకాలంలో 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోవడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం మానుకుని, గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల చివరి దశ పనులను పూర్తి చేసి వాటి పూర్తి ఆయకట్టుకు నీరు అందించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న నేపథ్యంలో ప్రజల తరఫున బహిరంగ లేఖ విడుదల చేయనున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనతో ప్రజలకు మేలు జరుగుతుందని, ఇచ్చిన హామీలు నెరవేరుతాయని ఆశిస్తారని అన్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా సిద్దిపేటకు వచ్చినప్పుడు మల్లన్న సాగర్, వైద్య కళాశాల, జిల్లా కలెక్టరేట్లను ప్రారంభించారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండుసార్లు సిద్దిపేటకు వచ్చినా ప్రజలకు ప్రయోజనం చేకూర్చే నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. 2024 మే 2న అంబేద్కర్ చౌరస్తా వద్ద కొమురవెల్లి మల్లన్న సాక్షిగా ఆగస్టు 15లోపు రెండు లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారని, అయినప్పటికీ ఇప్పటికీ అనేక మంది రైతులకు రుణమాఫీ జరగలేదని ఆరోపించారు.

సిద్దిపేట నియోజకవర్గంలో 20,514 మందికి మాత్రమే రుణమాఫీ కాగా, 22,819 మందికి రుణమాఫీ కాలేదని హరీశ్‌రావు వెల్లడించారు. రుణమాఫీ అవుతుందన్న ముఖ్యమంత్రి మాటలను నమ్మి రెండు లక్షల రూపాయలకు మించి అప్పులున్న రైతులు అదనపు అప్పులు చేసి బ్యాంకుల్లో చెల్లింపులు చేశారని, వారంతా ఇబ్బందుల్లో పడ్డారని అన్నారు. ముఖ్యమంత్రి మరోసారి సిద్దిపేటకు వస్తున్నందుకు స్వాగతం పలుకుతున్నామని, అయితే ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసి రావాలని కోరారు. రైతులందరికీ రుణమాఫీ చేసిన తర్వాతే సిద్దిపేటకు రావాలని, అలా వస్తే తానే స్వయంగా పుష్పగుచ్ఛం అందజేస్తానని వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, రైతులకు ఇచ్చిన హామీని అమలు చేసి ముఖ్యమంత్రి పదవికి గౌరవం తీసుకురావాలని హరీశ్‌రావు కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా 1,924 మంది లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలను, మరో 523 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఏళ్ల తరబడి పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చాలాకాలంగా పింఛన్లు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులందరికీ చేయూత అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరు విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. పింఛన్ల మంజూరు ప్రక్రియను అర్హుల అవసరాలకు అనుగుణంగా కొనసాగిస్తామని వెల్లడించారు.

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని వివేక్ వెంకటస్వామి తెలిపారు. దుబ్బాక నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మరో 2,000 ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు సొంత గృహం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పేద కుటుంబాలకు స్థిరమైన నివాసం లభిస్తుందని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

ప్రజల రోజువారీ అవసరాలు, ఆరోగ్యం, ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం, పేదలకు సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని తెలిపారు. ఈ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

దుబ్బాక నియోజకవర్గంలో విద్యా రంగ అభివృద్ధికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసినట్లు వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు ఈ పాఠశాల ఉపయోగపడుతుందని తెలిపారు. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల భారాన్ని అధిగమిస్తూ కూడా ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. పేదలకు పింఛన్ భరోసా, ప్రతి కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించడంతో పాటు అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత సహాయ ఉపకరణాలు: మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

ఉచితంగా అందించడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారుల అవసరాలను పరిశీలించి వారికి తగిన ఉపకరణాలను గుర్తించేలా నిర్ధారణ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. సహాయ ఉపకరణాలు అందడం వల్ల వారి రోజువారీ పనులు సులభతరమవుతాయని, ఇతరులపై ఆధారపడే పరిస్థితి కొంతవరకు తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని సూచించారు. సైదాపూర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అలింకో సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. శిబిరం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయ ఉపకరణాలు అందేలా నిర్ధారణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారికి అవసరమైన సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగుల సేవలో స్వయంకృషి సంస్థ కృషి అభినందనీయం

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయడం గొప్ప విషయమని మంత్రి పేర్కొన్నారు. మూడు దశాబ్దాలకు పైగా సేవా దృక్పథంతో సంస్థను కొనసాగిస్తున్న నిర్వాహకులు, సిబ్బందిని అభినందించారు. సమాజంలో ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు అండగా నిలవడం, వారికి అవసరమైన సహాయం అందించడం ఎంతో బాధ్యతతో కూడిన సేవ అని అన్నారు.

సంస్థలో దివ్యాంగుల్లో కనిపించిన ఆత్మవిశ్వాసం, వారి ముఖాల్లోని చిరునవ్వులు తనను ఎంతగానో కదిలించాయని సీతక్క తెలిపారు. ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా తమ సామర్థ్యాలను గుర్తించి ముందుకు సాగేందుకు ఇలాంటి సంస్థలు అందిస్తున్న సేవలు కీలకమని అభిప్రాయపడ్డారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి అన్నారు. విద్య, ఉపాధి, సామాజిక భాగస్వామ్యం వంటి రంగాల్లో వారికి తగిన అవకాశాలు అందినప్పుడే సమానత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు, ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. దివ్యాంగుల కోసం నిరంతరం సేవలందిస్తున్న స్వయంకృషి వంటి సంస్థలకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీతక్క హామీ ఇచ్చారు. ఇలాంటి సేవా సంస్థలకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తూ, దివ్యాంగుల గౌరవం, సమాన హక్కులు, అవకాశాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. సంస్థ సేవలను కొనసాగిస్తున్న బృందానికి మరోసారి అభినందనలు తెలిపారు.

పాత ఇళ్ల పథకాల లబ్ధిదారులకు ఇంటి పట్టాలు తిరిగి ఇవ్వాలని ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారుల వద్దకు వారి ఇంటి పత్రాలను తిరిగి చేర్చాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

రాష్ట్రంలో 22ఏ భూముల అంశంపై సమీక్షలు జరుగుతున్న సమయంలో తహసీల్దార్ కార్యాలయాల్లో లబ్ధిదారుల ఇంటి పట్టాలు పెద్ద సంఖ్యలో ఉన్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి వచ్చిందని పొంగులేటి తెలిపారు. వెంటనే ఆ పత్రాలను పేదలకు తిరిగి అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేశామని, వివిధ కారణాలతో ఇప్పటివరకు పత్రాలు అందని అర్హులైన లబ్ధిదారులకు వాటిని తిరిగి ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

2014కు ముందు అమలైన గృహ నిర్మాణ పథకాలలో ప్రభుత్వ సబ్సిడీతో పాటు లబ్ధిదారుల వాటా, బ్యాంకు రుణాల ద్వారా ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించేవారని మంత్రి వివరించారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందే సమయంలో లబ్ధిదారుల ఇంటి పట్టాలను ష్యూరిటీగా ఉంచుకునేవారని తెలిపారు. రుణ వాయిలన్నీ సక్రమంగా చెల్లించి మొత్తం రుణా తిరిగి చెల్లించిన వారికి ఆ పత్రాలను వెనఇచ్చే విధానం ఉండేదని చెప్పారు. అయితెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇందిమ్మ గృహ నిర్మాణ పథకం నిలిచిపోవడంతో కొంతమంది లబ్ధిదారులకు వారి ఇంటి పట్టాలు తిరిగి అందలేదన్నారు.

వివిధ కారణాలతో తనఖాలో ఉన్న పత్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనే మిగిలిపోయి పట్టాలను అర్హులైన లబ్ధిదారులకు తిరిగి అందించాల్సి ఉందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పేదల సొంతింటిపై హక్కు మరింత భద్రం చేయడంతో పాటు వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే ఈ నిర్ణయం ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఏళ్ల తరబడి ఇంటి పత్రాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది కుటుంబాలకు ఉపశమనం కలగనుంది.

హరీశ్‌రావు అవినీతి ఆరోపణలపై నిగ్గు తేల్చాలి: కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ అంశంపై ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగించడంతో పాటు చట్టపరంగా, న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అనుసరిస్తామని స్పష్టం చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఆమె మీడియాతో మాట్లాడారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సేకరించి సీబీసీఐడీతో పాటు కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు కూడా పంపిస్తామని వెల్లడించారు. తప్పు చేసిన వారెవరైనా చట్ట ప్రకారం శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సమస్యలపై తగిన శ్రద్ధ చూపడం లేదని కవిత విమర్శించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. పంటల పరిస్థితి, వ్యవసాయ రంగానికి అవసరమైన సహాయం గురించి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను ప్రస్తావించకపోవడం అన్యాయమని వ్యాఖ్యానించారు.

పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లు అంశాన్ని కూడా ప్రధానమంత్రి వద్ద ప్రస్తావించకపోవడంపై కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను పక్కనపెట్టి కాంట్రాక్టులు, కమీషన్ల గురించే ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు మండలాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు పంటలు వేయవద్దని సూచించే పరిస్థితి రావడం ఆందోళనకరమని, పంటలు సాగు చేయకపోతే రైతులకు ప్రభుత్వం ఎలాంటి పరిహారం అందిస్తుందో స్పష్టం చేయాలని కోరారు. సాగు చేయని ప్రతి ఎకరానికి రూ.25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడమే తమ పార్టీ లక్ష్యమని కవిత తెలిపారు. పాంచజన్య సంకలంలో భాగంగా త్వరలో భైరవ వాహనంలో రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపట్టనున్న ప్రకటించారు. ప్రజల్లో చైతన్యం తీసుకువడం, వారి సమస్యలను తెలుసుకోవడం ఈ యాత్ర ఉద్దేశమని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, కనీసం జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించలేదని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పట్టభద్రులను కోరారు.

ఇదే సమయంలో ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కవిత తప్పుబట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగానికి సంబంధించిన వర్గాలతో చర్చించకుండా ఇలాంనిర్ణయాలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై మంగళవారం తమ పార్టీ ఆధ్వర్యంలో రౌంటేబుల్ సమావేశం నిర్వహించనున్న తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు తగిన స్థాయి స్పందించడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, సామాజిక న్యాయం కోసం తమ పార్టీ ముందుకు సాగుతుందని కవిత వెల్లడించారు.

రాహుల్ గాంధీతో తెలంగాణ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ బి.ఎం. సందీప్ భేటీ

- **తెలంగాణ బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వక కలయిక**
- **లోక్‌సభ ప్రతిపక్ష నేతతో సమావేశం**
- **ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా ఇటీవల నియామకం**
- **సందీప్ భేటీపై కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి**

న్యూఢిల్లీ, నవంబర్ 16 : తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన బి.ఎం. సందీప్ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. నేడు జరిగిన ఈ భేటీలో సందీప్ రాహుల్ గాంధీని కలిసి తన నియామకం అనంతరం శుభాకాంక్షలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యతలను బి.ఎం. సందీప్‌కు ఏఐసీసీ అప్పగించింది. ఈ నేపథ్యంలో ఆయన రాహుల్ గాంధీతో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేతతో ఆయన భేటీ అయ్యారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యవహారాలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల్లో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు కీలకంగా ఉంటాయి. రాష్ట్ర పార్టీ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌ఛార్జ్ బాధ్యతల్లో భాగంగా ఉంటుంది.

రాహుల్ గాంధీతో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశానికి సంబంధించిన వివరాలను బి.ఎం. సందీప్ తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా వెల్లడించారు. తెలంగాణ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేతను కలిసిన విషయాన్ని తెలియజేశారు. ఈ భేటీకి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉంది. తెలంగాణలో పార్టీ బాధ్యతలు చేపట్టిన సందీప్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ఎలా ముందుకు తీసుకెళ్తారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



తెలంగాణ ఉద్యమ పాదయాత్రకు 15 ఏళ్లు

(మొదటి పేజీ తరువాయి)

వికారాబాద్ నుంచి కుత్బుల్లాపూర్ వరకు పాదయాత్ర కొనసాగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల మీదుగా సాగిన ఈ యాత్ర ద్వారా తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రజలకు వివరించడంతో పాటు ప్రత్యేక రాష్ట్రం కోసం సాగుతున్న ఉద్యమానికి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు.తెలంగాణ సాధనే ప్రధాన లక్ష్యంగా సాగిన ఈ పాదయాత్రలు ఉద్యమ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఉమ్మడి జిల్లాల స్థాయిలో కార్యక్రమాలు చేపట్టడం ద్వారా తెలంగాణ ఆకాంక్షను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవకాశం కలిగింది. ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషించాయి. 2011 నవంబర్ 16న ప్రారంభమైన ఆ పాదయాత్రలు తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. రాష్ట్ర సాధన కోసం నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి, ప్రజలు నెలకొన్న ఆకాంక్ష, ఉద్యమ సమయంలో కనిపించిన ఐక్యత ఆనాటి జ్ఞాపకాలను ఇప్పటికీ గుర్తు చేస్తున్నాయి. ఆ పోరాటంలో భాగమైన పాదయాత్రలు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమ ప్రయాణంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచిపోయాయి. పాదయాత్రలు ప్రారంభమై 15 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆనాటి ఉద్యమ జ్ఞాపకాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఆ పోరాటంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తల కృషి ఉద్యమ అభిమానులు స్మరించుకుంటున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో బలంగా నిలిపిన ఆనాటి ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయమని గుర్తుచేసుకుంటున్నారు.

టీఎస్ యుటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

- ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన ఖమ్మం జిల్లా కమిటీ
- అధ్యక్ష , కార్యదర్శులు గా షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు ఎన్నిక







ముదిగొండ, నవంబర్ 16(భద్రాద్రి న్యూస్):-
ముదిగొండ మండల కేంద్రం లో రెండు రోజులుగా జరుగుతున్న టీఎస్ యుటీఎఫ్ జిల్లా మహాసభలలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ లో మొత్తం 111 మందిని కమిటీ సభ్యులుగా, 20 మందిని జిల్లా ఆఫీస్ బేరర్లుగా ,32 మందిని జిల్లా మహాసభ ప్రతినిధులుగా , 8 మందిని ఎఫ్.డబ్ల్యూ.ఎస్ రాష్ట్ర కౌన్సిలర్లుగా, 5 గురిని ఆడిట్ కమిటీ సభ్యులుగా మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బుర్రి.వెంకన్న , షమీ, కోశాధికారిగా వల్లంకొండ రాంబాబు, కార్యదర్శులుగా రాందాస్, నర్సయ్య, నాగేశ్వరరావు, సురేష్ ,నిర్మలా కుమారి, వలీ, ఉద్దండ్, పద్మ, రామకృష్ణ, కోటేశ్వరరావు, ఉమామహేశ్వర రెడ్డి, విజయ్, ప్రశాంతి, శ్రీనివాసరావు, సుధాకర్ ఆడిట్ కమిటీ సభ్యులుగా అరవింద కుమార్ ,కే వెంకటేశ్వర్లు ,జిడిఎస్వి రమణ ,ఎండి రఫీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బి. రాజు వ్యవహరించారు. పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా. దుర్గాభవాని, సహాయకులుగా మందడపు శ్రీనివాసరావు తదితరులువ్యవహరించారు .

ఈనెల 20న అభిషేక కార్యక్రమం

- నిర్వహించనున్న బిషప్ డాక్టర్ రెవరెండ్ కే సేనం రాజ్
- 28మంది సంపూర్ణ గురువులు
- 4 గురు సహాయక గురువులు



పాలేరు, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్):
ఈనెల 20న అభిషేక కార్యక్రమాలు నిర్వహించినట్లు బిషప్ డాక్టర్ రెవరెండ్ కే సేనం రాజ్ తెలిపారు. బెంగళూరు, బిషప్స్ కాలేజీలో, హైదరాబాద్ కళాశాలలో, డోర్నకల్ బోధకుల కళాశాలలో, థియాలాజికల్ విద్యను అభ్యసించిన క్రైస్తవ మత గురువులకు ఆర్డినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బిషప్ రెవరెండ్ డాక్టర్ కె సైన్యం రాజ్ వివరించారు. ఇప్పటికే పలు సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న గురువులకు 32 మందికి గాను 28 మంది సంపూర్ణ గురువులు గా, 4 గురు సహాయక గురువుగా అభిషేకం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారుగా 4000 మంది హాజరుకానున్నట్లు తెలంగాణ, చత్తీస్గడ్, ఒరిస్సా, కొంత భాగం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుండి అధిక విశ్వాసులు పాల్గొననున్నట్లు బిషప్ రెవరెండ్ డాక్టర్ కె సేనం రాజ్ పేర్కొన్నారు. బిషప్ పదవి చేపట్టిన మూడు నెలల కాలంలోనే డోర్నకల్ అధ్యక్ష మండలాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఇప్పటికే అనేక దేవాలయాలకు, గురు నిలయాలకు, ఫౌండేషన్ స్టోన్స్ మరియు ప్రారంభోత్సవాలు, నిర్ధారణ కార్యక్రమాలను చేపడుతున్నారని పలువురు హర్ష వ్యక్తం చేస్తున్నారు. బిషప్ పదవి చేపట్టిన మొదటి అభిషేక కార్యక్రమంగా వారి చేతుల మీదుగా అభిషేకం తీసుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నారు. ఇప్పటికే అభిషేక కార్యక్రమానికి అంగురంగుల వైభవంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట.. చర్లలో పథకాల జాతర

- అర్హుల ఎదురుచూపులకు తెర.. 14,038 రేషన్ కార్డులు, 950 పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ
- 21 మంది ఆడ బిడ్డలకు కళ్యాణలక్ష్మి కానుకలు..
అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





చర్ల, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్): సంక్షేమ పథకాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. అర్హులైన పేదల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపే లక్ష్యంతో చర్ల మండలంలో భారీ స్థాయిలో సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఒకేసారి వేలాది రేషన్ కార్డులు, వందలాది పెన్షన్ మంజూరు పత్రాలు, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేయడంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలోని నందీశ్వరుని కళాభవన్‌లో మండల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పెన్షన్ మంజూరు పత్రాలు, కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 14,038 రేషన్ కార్డులు, 950 పెన్షన్ మంజూరు పత్రాలు, 21 కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్యంగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందడంతో వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. నెలవారీ పెన్షన్లు వారి జీవనానికి ఆర్థిక ఆసరాగా నిలవనున్నాయి. మరోవైపు రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పొందే అవకాశం కలగనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, కల్యాణలక్ష్మి వంటి పథకాలు పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత ఉండి ఇంకా ఏవైనా పథకాలు అందని వారు అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. చర్ల మండలంలో ఇంత పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు అందజేయడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెన్షన్ మంజూరు పత్రాలు పొందిన వృద్ధులు, దివ్యాంగులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





ఎవరు చెప్పినా మేము మారం గాక మారం...

మా స్టైల్ అంతే..

- జిల్లా కలెక్టర్,ఎంపీడీవో ఆదేశాలు 'బేఖాతరు'..
- సీఎం ప్రజావాణికి కీలక శాఖల అధికారుల డుమ్మా!
- రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తున్న ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు
- రేవంత్ ప్రభుత్వం పై విశ్వాసం కోల్పోతున్న గ్రామ ప్రజలు ఎక్కడి సమస్య అక్కడే పేపర్లకే పరిమితం
- సమయం?11 దాటినా ఖాళీ కుర్చీలే దర్శనం-?నిర్లక్ష్యపు నీడలో 'ప్రజావాణి'.. అర్జీదారుల ఆగ్రహం

కామేపల్లి, నవంబరు16 (భద్రాద్రిన్యూస్):
ఎవరు చెప్పినా మేము మారం గాక మారం... మా జిల్లాస్థాయి అధికారులు కావచ్చు... మండల స్థాయి అధికారులు కావచ్చు... మా స్టైలే అంతే... అన్న చందంగా తయారయింది మండలంలోని కీలక శాఖల అధికారుల వ్యవహారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'సీఎం ప్రజావాణి' ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించిన సీఎం ఈ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు అపహాస్యం చేస్తున్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా, గైర్హాజరైతే వేటు తప్పదని ఎంపీడీవో ధరావత్ సోమ్‌లాల్ కఠిన హెచ్చరికలు జారీ చేసినా మండలంలోని వివిధ శాఖల అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు. ?సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణికి 11 గంటలు దాటినా పలు కీలక శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కాలేదు. జాబితాలో పేరున్న బాధ్యతాయుతమైన అధికారులు స్వయంగా హాజరై రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు మొత్తం 24 మంది హాజరు కావలసి ఉండగా కేవలం 7 మంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. పలు శాఖల అధికారులు గైరాజర్ అయ్యారు.వివిధ సమస్యలపై తమ గోడు వెల్లబోసుకుందామని ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని వచ్చిన అర్జీదారులు అధికారుల కోసం గంటల తరబడి వేచి చూశారు. దీంతో వారు ఖాళీ కుర్చీలను చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గైరాజర్ కావటం తో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడుతున్నారు.ప్రధాన శాఖలైన రెవిన్యూ, అగ్రికల్చర్, విద్యాశాఖ అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు.వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, ఎక్సైజ్,ఆర్ అండ్ బి, ఐ టి డి ఏ హార్టికల్చర్, మత్స్య శాఖ అధికారులు అసలు అడ్రస్ లేరు.మరికొందరు అధికారులు ఈ సమావేశానికి తమ సొంత పనులు ముగించుకొని తీరిక చూసుకొని ఆలస్యంగా హాజరు కావటం తాము గ్రామాల్లో విజిట్ కు వెళ్ళామని అందుకే ఆలస్యం అయిందని చెప్పటం ఒక కోస మెరుపు ఇప్పుడు వరకు జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి అందరు మండల స్థాయి అధికారులు ఒక్కసారి కూడా సమావేశానికి హాజరైన దాఖలాలు లేవు. కొన్ని శాఖల అధికారులు వస్తే కొన్ని శాఖల అధికారులు అసలు అడ్రస్ ఉండటం లేదు. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెట్టుకున్న ఉన్నత లక్ష్యం నీరు గారి పోతుంది జిల్లా ఉన్నతాధికారుల హెచ్చరిక లనే లెక్కచేయని ఈ 'దుమ్మా' అధికారులపై జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. అనే కోణంలో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మాటూరులో వ్యవసాయ మోటర్ల వైర్లు, పైపుల చోరీలు..

- రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దొంగలు!
- ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరు గ్రామంలో వ్యవసాయ పొలాల్లో చోరీలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.



వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ మోటర్లకు సంబంధించిన వైర్లను గుర్తుతెలియని దొంగలు కట్ చేసి ఎత్తుకెళ్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోటర్లతో పాటు పైపులు కూడా అపహరణకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక పంటల సాగుపై ఆందోళన చెందుతున్న రైతులకు ఈ చోరీలు మరింత భారంగా మారాయి. లిరాత్రివేళ పొలాలకు వెళ్లాలంటేనే రైతులు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసులు స్పందించి గ్రామ పరిధిలో రాత్రి వేళల్లో నైట్ బీట్ నిర్వహించాలని, వ్యవసాయ పొలాల వద్ద ఇటువంటి చోరీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మాటూరు గ్రామ రైతులు పోలీసులను విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల కష్టాలను గుర్తించి పోలీసులు తక్షణమే స్పందించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

కార్తీక మాసం ఆలయాల్లో శివుడు కు విశేష పూజలు





కామేపల్లి, నవంబర్16 (భద్రాద్రిన్యూస్): కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా స్థానిక శ్రీ గురు హరిహర మందిరంలో శివునికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని తులసికోట, నవగ్రహాల వద్ద దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం శివునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. శివుని కృపకు పాత్రులు అయ్యారు. మొక్కులు తీర్చుకొని శివ నామస్వరంతో ఆలయం మారుమోగిందని భక్తులు తెలిపారు.

వీవో భవన నిర్మాణ స్థలం మార్చాలని ప్రజల వినతి

- ప్రజావాణి లో ప్రజల ఫిర్యాదు
- బండిపాడుకు బదులుగా కొండాయిగూడెం రెవిన్యూలో ప్రభుత్వస్థలం కేటాయించాలని ప్రజల విజ్ఞప్తి



కామేపల్లి, నవంబర్16 (భద్రాద్రిన్యూస్):- కామేపల్లి మండల లోని రుక్మితండా గ్రామ పంచాయతీ పరిధిలోని మహిళా సమాఖ్య వీవో బిల్డింగ్ నిర్మాణ స్థలాన్ని మార్చాలని కోరుతూ బండిపాడు, రాయిగూడెం గ్రామ ప్రజలు గుగులోత్ రవి నాయక్ కామేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ?మహిళా సమాఖ్య భవన నిర్మాణ నిమిత్తం గతంలో బండిపాడు హ్యాబిటేషన్‌లోని కూలిపోయే స్థితిలో ఉన్న అంగన్‌వాడీ-1 స్థలాన్ని ఎంపిక చేసి,జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపడం జరిగిందని వారు పేర్కొన్నారు. అయితే ఈప్రతి పాదనను పరిశీలించి మంజూరు చేయకపోవటం వలన రాయిగూడెం హ్యాబిటేషన్‌లో ఉన్న తిరుపతమ్మ తల్లీ గుడి పక్కన కొండాయిగూడెం చెరువు శిఖం స్థలానికి ప్రక్కనే కేటాయించాలని గ్రామస్తులు కోరారు.స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ భూమిని కేటాయించి భవన నిర్మాణం చేపట్టాలని వారు అధికారులను అభ్యర్థించారు.

బాదావత్ లాలి కుటుంబానికి ఆర్థిక సాయం

- లాలి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు
- గ్రామ కాంగ్రెస్ నాయకులు నివాళి



కామేపల్లి, నవంబర్16 (భద్రాద్రిన్యూస్): మండలంలోని సాతానిగూడెం గ్రామానికి చెందిన బాదావత్ లాలి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబానికి స్థానిక సర్పంచ్ బి. రెడ్యా నాయక్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సత్తి వీరబాబు యాదవ్ ఆధ్వర్యంలో రూ. 5,000 ఆర్థిక సాయం అందజేసి భరోసా కల్పించారు.లాలి దశదిన కర్మ సందర్భంగా ఆమె కుటుంబాన్ని పరామర్శించిన మనో ధైర్యాన్ని కల్పిస్తూ. గ్రామ సర్పంచ్ రెడ్యా గ్రామ అధ్యక్షుడు సత్తి వీరబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ,వార్డు సభ్యులు లక్ష్మి, సీనియర్ నాయకులు బద్రు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట నరసయ్య,భాషా నాయక్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
Bhadradrinews Telugu Daily
తెలుగు దినపత్రిక
Follow : @bhadradrinews
మంగళవారం
17 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రైల్వే శాఖ

– కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్ నుంచి హేమచంద్రాపురం వరకు రహదారి విస్తరణకు మార్గం సుగమమైంది. రోడ్డు విస్తరణ కోసం రైల్వే శాఖకు చెందిన 20 అడుగుల స్థలాన్ని కేటాయించేందుకు అధికారులు అంగీకరించడం శుభపరిణామమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ రహదారి విస్తరణ కోసం తాను రైల్వే ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చలు జరిపి, వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. తమ నిరంతర కృషికి ఫలితంగా రైల్వే శాఖ సానుకూలంగా స్పందించి స్థలం కేటాయించేందుకు అంగీకరించిందన్నారు. ఇప్పటికే ఈ రహదారిని మరింత సుందరంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.కోటి నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. రైల్వే స్థలం అందుబాటులోకి రావడంతో రోడ్డు విస్తరణ పనులకు మరింత ముందడుగు పడిందన్నారు. విస్తరణ పనులు పూర్తయితే రైల్వే స్టేషన్ నుంచి హేమచంద్రాపురం మార్గంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతో పాటు వాహనదారులు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని కూనంనేని ఆశాభావం వ్యక్తం చేశారు.

పేద విద్యార్థుల భవిష్యత్తుకు గాదంశెట్టి కుటుంబం అండ!

- జన్మదిన వేడుకలకు ఆడంబరాలకు దూరం.. విద్యార్థులకు సేవే లక్ష్యంగా వితరణ
- వనవాసీ విద్యార్థుల సంక్షేమానికి కుటుంబం చేస్తున్న సేవలు అభినందనీయం -- గౌరవ సలహాదారు బీవీఎస్ఎల్ నరసింహారావు



చర్ల, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్): విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, పేద విద్యార్థులకు చేయూతనందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వనవాసీ కళ్యాణ పరిషత్ గౌరవ సలహాదారు బీవీఎస్ఎల్ నరసింహారావు అన్నారు. చర్లకు చెందిన వస్త్ర వ్యాపారి గాదంశెట్టి నరసింహారావు--ప్రసన్నలక్ష్మి కుటుంబం వనవాసీ విద్యార్థుల సంక్షేమానికి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. గాదంశెట్టి నరసింహారావు--ప్రసన్నలక్ష్మి దంపతుల కుమార్తె, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని లక్ష్మి నరసింహ దివిత జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కొమరం భీం, శబరి బాలికల విద్యార్థి నిలయాల్లో విద్యార్థులకు బియ్యం, చలికోట్లు, భోజనం, స్వీట్లు, పండ్లు, కారంపొడి తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. స్థానిక విద్యార్థి నిలయాల్లో కార్యదర్శులు జవ్వాది మురళీకృష్ణ, బండా స్వరూపరాణి అధ్యక్షతన వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో బీవీఎస్ఎల్ నరసింహారావు మాట్లాడుతూ.. గాదంశెట్టి నరసింహారావు--ప్రసన్నలక్ష్మి దంపతులతో పాటు వారి కుమారుడు, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న నరసింహదేవ, కుమార్తె దివిత కూడా సేవాభావం కలిగిన వారని ప్రశంసించారు. గత కొన్నేళ్లుగా విద్యార్థి నిలయాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన వస్తువులను అందిస్తూ ఈ కుటుంబం తన దాతృత్వాన్ని చాటుకుంటోందని పేర్కొన్నారు. గతంలో నరసింహదేవ తన మొదటి నెల జీతాన్ని విద్యార్థుల సంక్షేమానికి అందించడంతో పాటు బీరువా, కిటికీలకు గ్రిల్స్, మూడు క్వింటాళ్ల బియ్యం, విద్యార్థులకు పరుపులు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. తండ్రి, సోదరుడి సేవా మార్గంలోనే పయనిస్తూ కుమార్తె దివిత తన జన్మదినాన్ని కూడా పేద విద్యార్థుల మధ్య జరుపుకోవడం అభినందనీయమన్నారు. పుట్టినరోజులు, ఇతర వేడుకలను ఆడంబరాలకు పరిమితం చేయకుండా ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ స్థాయికి తగ్గట్టుగా పేద విద్యార్థుల చదువులకు చేయూతనందించి వారి భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో గాదంశెట్టి ప్రసన్నలక్ష్మి, గాదంశెట్టి సుధారాణి, నంబూరి అశ్విని, విద్యార్థి నిలయ కమిటీ ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్, వేములపల్లి ప్రవీణ్ బాబు, పోలిన రమాదేవి, బుటారి సుజాత, నిలయ ప్రముఖులు సంతోష్, వరలక్ష్మి, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే మేధాశక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతాయి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు జిల్లా కేంద్ర గ్రంథాలయం భద్రాద్రి కొత్తగూడెంలో పుస్తక పఠనంపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శి కె. కరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రంథపాలకుడు బాబు, చుంచుపల్లి ఉపాధ్యాయుడు రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో, మెదడుకు కూడా పుస్తక పఠనం అంతే అవసరమని అన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఇంటర్నెట్, వైపై వంటి సాంకేతిక పరిజ్ఞానానికి ఎక్కువగా అలవాటు పడుతున్నారని, పుస్తక పఠనం ద్వారా మేధాశక్తి, జ్ఞాపకశక్తి పెంపొందుతాయని వివరించారు. విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రంథాలయ కార్యదర్శి కె. కరుణకుమారి మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా నిర్వహిస్తూ, విద్యార్థులు, పాఠకులకు అవసరమైన అన్ని సదుపాయాలను గ్రంథాలయ చైర్మన్ ఆధ్వర్యంలో కల్పిస్తున్నామని తెలిపారు. పాఠకులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పుస్తక పఠనం విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు కూడా గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-2 గ్రంథపాలకురాలు ఎస్. లలితకుమారి, జి. మణిమృదుల, గీత, మధుబాబు, గ్రంథాలయ సిబ్బంది వినోద్, ఈశ్వరి, దివ్య, పలువురు వక్తలు, పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం హైదరాబాద్‌లో సీమరశంఖం?

- డిసెంబర్ 9న లక్షలాది ఆదివాసీలతో ఛలో హైదరాబాద్
- డోలీలు, విల్లంబులతో కదలిరావాలి.. హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి
- తుడుం దెబ్బ డివిజన్ ఉపాధ్యక్షులుగా మనుబోతుల సురేష్ ఎన్నిక



వెంకటాపురం, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్): ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం మరో భారీ పోరాటానికి తుడుం దెబ్బ సమరశంఖం పూరించింది. ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు డిసెంబర్ 9న హైదరాబాద్ రాజధాని నడిబొడ్డున లక్షలాది మంది ఆదివాసీలతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షుడు పొడెం బాబు పిలుపునిచ్చారు. ప్రతి ఆదివాసీ గూడెం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. డిసెంబర్ 9న నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం వెంకటాపురం మండల కేంద్రంలోని రహదారులు, భవనాల శాఖ అతిథి గృహ ఆవరణలో తుడుం దెబ్బ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొడెం బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆదివాసీల హక్కులు, మనుగడ ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీల హక్కులను హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలోని నీళ్లు, నిధులు, ఉద్యోగాలపై ఆదివాసీలకు దక్కాల్సిన హక్కులను మైదాన ప్రాంతాలకు మళ్లించే విధానాలను ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. గత ఐదు దశాబ్దాలుగా ఎస్టీ రిజర్వేషన్ల అంశంలో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని, జోనల్ విధానం పేరుతో ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ అవకాశాలకు గండికొడుతున్నారని ఆరోపించారు. ఆదివాసీలపై జరుగుతున్న అటవీశాఖ దాడులను నిలిపివేయాలని, గోదావరి జలాల వాటాలో న్యాయం చేయాలని, సింగరేణి ఉద్యోగాల్లో ఆదివాసీలకు న్యాయమైన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగం, పేపర్ బోర్డు తదితర రంగాల్లో ఆదివాసీల హక్కులు, వాటాలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరారు. ముఖ్యంగా 1/70 చట్టం, ఆదివాసీ హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. ఈ సమస్యలన్నింటిపై రాష్ట్ర రాజధానిలో ఆదివాసీల గళాన్ని వినిపించేందుకే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామం, ప్రతి గూడెంలో ఆదివాసీ ప్రజలను చైతన్యపరిచి డిసెంబర్ 9న నిర్వహించే బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలించాలని పిలుపునిచ్చారు. డోలీలు, విల్లంబులతో లక్షలాది మంది ఆదివాసీలు హైదరాబాద్‌కు చేరుకుని తమ ఐక్యతను, పోరాట పటిమను చాటాలని కోరారు.

డివిజన్ ఉపాధ్యక్షులుగా మనుబోతుల సురేష్ ఎన్నిక

ఛలో హైదరాబాద్ కరపత్రాల ఆవిష్కరణ అనంతరం తుడుం దెబ్బ డివిజన్ ఉపాధ్యక్షులుగా మనుబోతుల సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షుడు పొడెం బాబు తుడుం దెబ్బ కండువా కప్పి ఆయనను సంఘంలోకి ఆహ్వానించారు. ఆదివాసీ గ్రామాల్లో ప్రజలను చైతన్యపరుస్తూ ఆదివాసీ చట్టాల అమలు, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన నాయకత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులుషే బాలకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రేగ గణేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం చంటి, వెంకటాపురం మండల అధ్యక్షుడు పూనెం శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రేగ నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ విచ్చ సురేష్, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి పాయం శశికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్షిక అనిల్, కార్యవర్గ సభ్యులు మేకల మహేష్, బొచ్చ నరసింహమూర్తి, సబక రాజు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1వ 2వ మరియు 3వ తేదీలలో సెయింట్ మేరీస్ హై స్కూల్ కొత్తగూడెం నందు పాఠశాలల ప్రత్యేక సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు

- అన్ని యాజమాన్యాల పాఠశాలలు తప్పనిసరిగా పాల్గొనాలి
- భాద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యా శాఖాదికారి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ, 2వ, మరియు 3వ తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్, ఇన్స్పైర్ మరియు పీఎంశ్రీ పాఠశాలల ప్రత్యేక సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఈ ప్రదర్శనలు "సుస్థిర మరియు వికసిత్ భారత్ కోసం సైన్స్, టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్" అనే ప్రధాన ఇతివృత్తంతో జరగనున్నాయి. విద్యాశాఖ అధికారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులలో శాస్త్రీయ నైపుణ్యాలను, సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ పోటీలు ఒక గొప్ప అవకాశమన్నారు, డిసెంబర్ 1వ 2వ మరియు 3వ తేదీ లలో జరగబోయే ఈ ప్రదర్శనలకు జిల్లాలోని అన్ని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు చురుకైన పాత్ర పోషించాలని, విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉంటూ పై ఇతివృత్తాలపై అద్భుతమైన ప్రాజెక్టులను సిద్ధం చేయించాలని సూచించారు. ఇతర వివరాలకు, సందేహాలకు జిల్లా సైన్స్ అధికారి బి. సంపత్ కుమార్ 9010043945 గారిని సంప్రదించాలన్నారు. ఈ జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, అన్ని రకాల గురుకులు ఎయిడెడ్, ప్రైవేట్, ఆశ్రమ, కెజిబివి మరియు కార్పొరేట్ తదితర అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు విధిగా పాల్గొనాలని జిల్లా విద్యాశాఖ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పాఠశాల వినూత్న ప్రాజెక్ట్ ప్రదర్శించేలా ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు.

విద్యార్థుల పరిశోధనల కోసం 7 ఉప-అంశాలు: విద్యార్థులు తమ వినూత్న శాస్త్రీయ ఆలోచనలను, పరిశోధనా ప్రాజెక్టులను క్రింది 7 ఉప-అంశాల ఆధారంగా రూపొందించి ప్రదర్శించాల్సి ఉంటుంది.

1. మెరుగైన జీవితం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: దైనందిన జీవిత సమస్యలను పరిష్కరించడంలో ఏఐ సాంకేతికత పాత్ర. 2. గ్రీన్ ఎనర్జీ & పర్యావరణ పరిరక్షణ: పునరుత్పాదక ఇంధన వనరులు, కాలుష్య నియంత్రణ మరియు పర్యావరణ రక్షణ మార్గాలు. 3. మ్యాథమెటికల్ మోడలింగ్ మరియు కంప్యూటేషనల్ థింకింగ్: గణిత నమూనాల ద్వారా క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం. 4. ఆరోగ్యం, పరిశుభ్రత మరియు పారిశుధ్యం: ప్రజారోగ్యం, వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రతను పెంపొందించే పద్ధతులు. 5. దేశీయ వ్యవసాయ పద్ధతులు: మన సాంప్రదాయ, సేంద్రీయ మరియు సుస్థిర వ్యవసాయ విధానాల విశిష్టత. 6. గ్రామీణ పరివర్తన కోసం సైన్స్: గ్రామాల్లో ఉపాధి, రవాణా, మౌలిక వసతుల మెరుగుదలకు తోడ్పడే తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక ఆవిష్కరణలు. 7. విపత్తు నిర్వహణ (: ప్రకృతి వైపరీత్యాలను ముందస్తుగా గుర్తించడం, ఎదుర్కొనే ప్రణాళికలు మరియు రక్షణ చర్యలు.

గత ఏడాది జిల్లా మొత్తంలో ఇన్స్పైర్ అవార్డుకు ఎంపికైన 76 ప్రాజెక్టుల విద్యార్థులు మరియు గైడ్ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలి. సదరు ప్రాజెక్టులను మరింత మెరుగ్గా సిద్ధం చేయడానికి అవసరమైన నగదు ఇప్పటికే ఆయా విద్యార్థుల ఖాతాల్లో జమ చేయబడింది. కావున, ఎంపికైన ఆ 76 ప్రాజెక్టులను కూడా ఈ జిల్లాస్థాయి ప్రదర్శనలోనే తప్పనిసరిగా ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం నుండి కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక గ్యాలరీని ఏర్పాటు చేయనున్నారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన అత్యాధునిక, సృజనాత్మక ప్రాజెక్టులను ఈ ప్రత్యేక గ్యాలరీలో ప్రదర్శించాల్సి ఉంటుంది. కావున అన్ని యాజమాన్యం పాఠశాలకు మరియు ఉపాధ్యాయులు ఈ మూడు ప్రదర్శనలు (సైన్స్ ఫెయిర్ ఇన్స్పైర్ మరియు పి.ఎం.శ్రీ వైజ్ఞానిక ప్రదర్శన) ప్రాజెక్టులను సిద్ధం చేసి, డిసెంబర్ 1వ 2వ మరియు 3వ తేదీల్లో "సెయింట్ మేరీస్ హై స్కూల్ కొత్తగూడెం" నందు భద్రాద్రి జిల్లా జరిగే జిల్లాస్థాయి ప్రదర్శనకు సిద్ధం కావాలని కోరారు.

ప్రజావాణి అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

- భాద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీపీఓ అనూషతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, గృహాలు, ఉపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య స్వభావం, అర్హతలను బట్టి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ఇతర శాఖల సహకారం అవసరమైన సందర్భాల్లో పరస్పర సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ భాగస్వామ్యంతో 'నా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్' అనే నినాదంతో పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను అదనపు కలెక్టర్లకు విన్నవిస్తూ దరఖాస్తులు సమర్పించారు. పిల్లల ప్రజావాణిలో మొత్తం 73 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ... పిల్లల ప్రజావాణి ద్వారా బాలల అవసరాలు, సమస్యలు, అభిప్రాయాలు, ఆశయాలు, ఆకాంక్షలను తెలుసుకొని వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ పిల్లల సమస్యలను వారి కోణంలో అర్థం చేసుకొని, వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా బాలల స్నేహపూర్వక పాలన సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి బాలుడు, బాలికకు విద్య, ఆరోగ్యం, రక్షణ, సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జిల్లా సంక్షేమ అధికారి కె.ఎం. తార, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎం.డి. సాధిక్ పాషా, ఎస్. సుమిత్రాదేవి, కె. అంబేద్కర్, బాలల సంరక్షణ అధికారి ఎం. హరికుమారి, నేషనల్ న్యూట్రిషన్ రూప, డీసీపీయూ సిబ్బంది ఆదే శేషయ్య, అబ్దుల్ అజీజ్, నాగరాజు, వినోద్ కుమార్, టి. బాబు, టి. భారతి, కళ్యాణి, లత, రాజు, చైల్డ్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ సందీప్ కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత ఆశయ సాధనకు కృషి చేస్తా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి
డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి, పట్టభద్రుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా అనేక పోరాటాలు చేసిన తనకు ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. పేదరికం నుంచి వచ్చిన బీసీ బిడ్డగా, కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి పీహెచ్‌డీ సాధించిన వ్యక్తిగా పట్టభద్రులు తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆశీర్వాదంతో బీసీ వర్గానికి చెందిన తనకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారని, బహుజన వర్గాల అభ్యున్నతికి ఆమె చేస్తున్న కృషికి పట్టభద్రులు మద్దతు తెలపాలని ఎన్నికల ఇన్‌చార్జి ఇస్మాయిల్ కోరారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ ఆశయాలను అధికారంలోకి వచ్చిన పార్టీలు విస్మరించాయని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను పక్కనపెట్టి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వెలుగుమట్ల భూసమస్యపై విశారదన్ మహారాజ్‌తో కలిసి మూడు రోజులపాటు దీక్ష చేపట్టి 400 కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇప్పించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. రోహిత్ వేముల చట్టం అమలు విషయంలోనూ ప్రభుత్వాన్ని ప్రశ్నించామని గుర్తుచేశారు. కొత్తగూడెం సింగరేణికి ప్రసిద్ధి చెందిన ప్రాంతమని, ఇక్కడి బొగ్గు గనులను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లడం స్థానిక యువత భవిష్యత్తుకు నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. డిగ్రీలు పూర్తి చేసిన పట్టభద్రులు కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. పోడు భూముల సమస్యలు, నిరుద్యోగ సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. గతంలో హామీలు ఇచ్చి గెలిచిన ప్రజాప్రతినిధుల



మాదిరిగా కాకుండా, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టభద్రులు తనకు అవకాశం కల్పించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డి. వీరన్న, ఖమ్మం జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి అనిత చౌదరి, రాష్ట్ర ఐటీ వింగ్ అధ్యక్షుడు ఎల్.కె. అశోక్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సముద్రాల క్రాంతి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి చైతన్య, ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జి వాసం రామకృష్ణ దొర, పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జి కోరెం గణేష్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాంకుడోతు రవి, ముసల రామకృష్ణ, విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు లకావత్ సురేష్, మహిళా విభాగం జిల్లా నాయకురాలు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ప్రజా సమస్యలపై సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ వినతి

- ఉమ్మడి కుటుంబాల కుమారులకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో న్యాయం చేయాలి
- ఎల్-3 జాబితాలో ఉన్న అర్హులను ఎల్-1 జాబితాలోకి మార్చాలని ఎంపీడీవోకు విజ్ఞప్తి
- అటవీ హక్కుల పట్టాలు పొందిన రైతులకు పీఎం కిసాన్ నిధులు విడుదల చేయాలని ఏఓకు వినతి

కారేపల్లి, భద్రాద్రి న్యూస్ రాములు:
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సింగరేణి మండల ప్రజావాణి కార్యక్రమంలో గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కు, వ్యవసాయ అధికారికి వినతిపత్రాలు అందజేసి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

ఉమ్మడి కుటుంబాల కుమారులకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అవకాశం కల్పించాలి

గతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సమయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉమ్మడి కుటుంబాలకు చెందిన కుమారులను సైతం ఎల్-3 జాబితాలో చేర్చారని సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి కుటుంబంలో ఉన్నప్పటికీ వేరుగా జీవనం సాగిస్తున్న అర్హులైన కుమారులను క్షేత్రస్థాయిలో విచారించి, నిబంధనల ప్రకారం ఎల్-3 జాబితా నుంచి ఎల్-1 జాబితాలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎంపీడీవో సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే గ్రామానికి వచ్చి క్షేత్రస్థాయిలో విచారణ చేపడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అటవీ హక్కుల పట్టాల రైతులకు పీఎం కిసాన్ అందించాలి

2018 సంవత్సరం తర్వాత అటవీ హక్కుల చట్టం కింద ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులకు పీఎం కిసాన్ నిధులు నిలిచిపోయిన విషయాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. అటవీ హక్కుల పట్టాలు పొందిన అర్హులైన రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా అందాల్సిన ఆర్థిక సహాయం అందేలా సమస్యను పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై వ్యవసాయ అధికారి స్పందిస్తూ సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు



పేర్కొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలే అందాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అర్హులైన పేదలకు ఎలాంటి అన్యాయం జరగకూడదని, సాంకేతిక కారణాలు లేదా జాబితాల్లో జరిగిన పొరపాట్ల వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోకూడదని సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ కోరారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో క్రీడాకారులు ప్రతిభ చాటాలి

- భద్రాద్రి కొత్తగూడెం
జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సూచనల మేరకు సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయాలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లోగో, మస్కట్ పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. అనూష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ నెల 15వ తేదీన కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ఢిల్లీలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లోగో, మస్కట్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటడంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులకు లభించే సర్టిఫికెట్లకు భవిష్యత్తులో మంచి ప్రాధాన్యత ఉంటుందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌పై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో విద్యార్థులకు ఈ క్రీడా పోటీల ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, బస్టాండ్



ఆవరణలు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా ద్వారా కూడా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సింగరేణి గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం
- ఆసరా పింఛన్లు, నూతన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ
- ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం: సర్పంచ్ మేదరి టోనీ



కారేపల్లి, భద్రాద్రి న్యూస్ రాములు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, నిరుపేద కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సింగరేణి గ్రామ పంచాయతీ పాలకవర్గం ముందుకు సాగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో గ్రామంలో ఆసరా పింఛన్లు, నూతన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మేదరి టోనీ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు, రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు.

పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలే కొండంత అండ

ఈ సందర్భంగా సర్పంచ్ మేదరి టోనీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు అందించే పింఛన్లు వారి జీవనానికి అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నూతన రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ సరుకులు అందడంతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా



బాధ్యతతో పనిచేస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

సింగరేణి గ్రామ అభివృద్ధికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అందిస్తున్న సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యంగా అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల మెరుగుదల, మురుగునీటి కాలువల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం

గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని మేదరి టోనీ తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తుల సమన్వయంతో అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోస్టర్ ఆవిష్కరణ



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి సూచన మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం 16-11-2026 న జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నందు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లోగో మరియు మస్కట్ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. డిసెంబర్ 11 నుండి 22వ తారీకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో జిల్లా వాస్తవంగా క్రీడాకారులు అన్ని క్రీడాంశాలలో పాల్గొని ప్రతిభ కనపరిచి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ సర్టిఫికెట్ కు భవిష్యత్తులో మంచి ప్రాధాన్యత ఉన్నందున క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పట్ల అవగాహన కల్పించాలని, స్కూల్స్, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మా కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రధాన కూడలిలో, బస్టాండ్ ఆవరణలో, ప్రజా సంచార ప్రదేశాలలో సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేసి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా, సోషల్ మీడియా ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ వారిని ఆదేశించారు.

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రూ.50 లక్షల ప్రమాద బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న పారితోషికంలో సగం మొత్తాన్ని పెన్షన్‌గా చెల్లించాలని, ఆదివారాలు, పండుగ సెలవులతో పాటు 20 రోజుల క్యాజువల్ సెలవులు, వేతనంతో కూడిన ఆరు నెలల మెడికల్ సెలవులు కల్పించాలని కోరారు. ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పొందిన వారికి ప్రమోషన్లు కల్పించాలని, రెండో పీఆర్సీ ప్రకటించి ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.30 వేలు నిర్ణయించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ఆశా వర్కర్లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర కమిటీ సమ్మె నోటీసులు అందజేసిందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకే ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, అధ్యక్షులు కే. బ్రహ్మచారి, కోశాధికారి జి. పద్మ, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూనెం ఝాన్సీ, దుబ్బా ధనలక్ష్మి నాయకత్వం వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు గద్దల శ్రీనివాస్, కే. సత్య, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు సుశీల, జయ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్‌దారులకు న్యాయం చేయాలి

-- చిన్న, చిన్న కారణంతో పెన్షన్‌దారులను బాధ పెట్టడం సరికాదు
-- అర్హులందరికీ పెన్షన్లు అందించాలని
డీఆర్‌డీఓ జాయింట్ కలెక్టర్ విద్యా చందనకు సిపిఐ ప్రతినిధి బృందం వినతి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో వివిధ చిన్న చిన్న కారణాల పేరుతో కరెంట్ బిల్లు, నాలుగు చక్రాల వాహనం, స్లాబ్ ఇల్లు ఉందనే చిన్న చిన్న కారణాలతో అర్హత ఉండి కూడా పేదల పెన్షన్లు ఆపడం సరైంది కాదని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మునిగడప వెంకటేశ్వర్లు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి భూక్య శ్రీనివాస్, 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ జాయింట్ కలెక్టర్, డిపిఆర్ఓ విద్యా చందనకు వివరించారు. చిన్న చిన్న కారణాలతో నిలిపివేసిన వారి అందరి పెన్షన్లను తక్షణమే ఆమోదించి వారికి కూడా చేయూత అందించాలని సోమవారం గ్రీవెన్స్ డేలో వినతి పత్రం అందించి మాట్లాడారు. పైన తెలిపిన చిన్న చిన్న కారణాలతో పాటు రూ.2 వేల లోపు సింగరేణి పెన్షన్ వచ్చేవారికి చేయూత అందించడంలో మానవత దృక్పథంతో వారిని అర్హులుగా తేల్చాలని కోరారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్, డీఆర్‌డీఏ విద్యా చందన అక్కడే ఉన్న చేయూత పెన్షన్ అధికార బాధ్యులను పిలిపించి రీ ఎంక్వయిరీ చేసి అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారని సిపిఐ ప్రతినిధి బృందం తెలిపింది. వినతిపత్రం అందించిన వారిలో రెండవ ఇంక్లైన్ సర్పంచ్ నగేశ్, సిపిఐ నాయకులు ఎండీ అంకుష్, సింగిరాల రమేశ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో గొప్పది

- కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో గొప్పదని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి పాత్రికేయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా సోమవారం కొత్తగూడెం బస్టాండ్ ఆవరణలో వనజీవి విశ్వామిత్ర చౌహాన్ ఆధ్వర్యంలో పాత్రికేయులతో కలిసి మొక్క నాటారు. ఈ సందర్భంగా డీఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రతిరోజూ మొక్కలు నాటుతున్న విశ్వామిత్ర చౌహాన్ కృషి అభినందనీయమని, పత్రికా దినోత్సవం సందర్భంగా బస్టాండ్‌లో మొక్క నాటడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వనజీవి విశ్వామిత్ర చౌహాన్ మాట్లాడుతూ వాక్ ఫర్ ట్రీస్ యజ్ఞంలో భాగంగా తన 1,628వ మొక్కను నాటినట్లు తెలిపాడు. మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కల్లోజీ శ్రీనివాస్, వీరు నాయక్, వట్టికొండ రవి, జోగం తారక రామారావు, బీర రవి, జేబీ బాలు, జబ్బార్, రాందాస్, ఇంగ్లీష్ బాలు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాలో పిల్లల ప్రజావాణి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : నేను నా హక్కులు.. నా భవిష్యత్ వాటి కోసం చైల్డ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం పిల్లల కోసం ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పిల్లల నుండి 73 ఫిర్యాదులు రాగా వాటిని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు అందజేశారు. తల్లిదండ్రులు లేని పిల్లలు వివిధ పాఠశాలల్లో చదువుతూ వారి ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో స్కాలర్‌షిప్ రావడం లేదని, మరికొంతమంది విద్యార్థులు తమ అమ్మనాన్నలు వేరే రాష్ట్రాల నుండి కొత్తకోటకు వలస వచ్చారు తమకు ఆధార్ కార్డులు లేవు, తమకు పథకాలు ఎలా వస్తాయంటూ వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా సంక్షేమ అధికారి మంగతార, ఐ సి పి ఎస్ అధికారి హరికుమారి, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు సాదిక్ పాషా, సుమిత్ర దేవి అంబేద్కర్, పోషణ్ అధికారి సంపత్, రూప, కళ్యాణి, శేషయ్య, అజిత్, నాగరాజు, వినోద్ బాబు, భారతి, లత, రాజు, సందీప్ కుమార్ పాల్గొన్నారు.

ప్రగతి వనం వ్యూ పాయింట్ ప్రమాదకరం



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించాల్సిన ప్రగతి వనం వ్యూ పాయింట్ ప్రమాదకరంగా మారింది. ఏమాత్రం ఏమరుపాటుగా అడుగువేసినా ప్రాణాల మీదకు వచ్చే పరిస్థితి నెలకొంది. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని ప్రగతి వనంలో చెరువు, చుట్టుపక్కల ప్రకృతి అందాలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్‌కు వెళ్లే స్టీల్ రౌండ్ నిచ్చెన ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరుకుంది. వ్యూ పాయింట్‌పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన నిచ్చెనలో ఒక మెట్టు పూర్తిగా ఊడిపోయింది. దీంతో నిచ్చెన ఎక్కే సమయంలో సందర్శకులు అదుపుతప్పి కిందపడే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో పార్కుకు వచ్చే సందర్శకులు వ్యూ పాయింట్‌పైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో ఊడిపోయిన మెట్టును గమనించకుండా అడుగువేస్తే తీవ్ర గాయాలపాలయ్యే ప్రమాదం ఉందని సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిచ్చెనకు సరైన మరమ్మతులు చేపట్టకపోవడంతో పాటు తగిన రక్షణ చర్యలు లేకపోవడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ కాస్తా ప్రమాదాలకు నిలయంగా మారకముందే అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సింగరేణి సివిల్ అధికారులు తక్షణమే స్పందించి ఊడిపోయిన మెట్టును బిగించడంతో పాటు నిచ్చెన మొత్తాన్ని తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే అప్రమత్తమై ప్రమాదాన్ని నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సింగరేణి ప్రతి ఉద్యోగి భద్రతకు అత్యంత ప్రాధాన్యం

- సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం సిహెచ్.వెంకటరమణ



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : సింగరేణి సంస్థలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గనుల్లో జరిగే ప్రమాదాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ అన్నారు. సోమవారం ఏరియా పరిధిలోని ఆర్ సి ఓ ఏ క్లబ్‌లో సింగరేణిలో ప్రమాదాల నివారణే లక్ష్యంగా సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఎస్ ఎం పి) అమలుపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఏరియాలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్. వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరూ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా కొత్తగూడెం, ఇల్లెందు, సత్తుపల్లి ఏరియాలకు చెందిన అన్ని గనులు, వివిధ విభాగాల అధికారులకు ఎస్.ఎం.పి టీమ్ సభ్యులకు భద్రతా నిర్వహణ ప్రణాళికపై ఐదు బ్యాచ్‌లుగా విభజించి సోమవారం నుండి డిసెంబర్ 5వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాన్ని అవగాహన కల్పించనున్నారు. గనుల్లో ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించడం, ప్రమాదాలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవడం, ఉద్యోగుల భద్రతను నిర్ధారించడం, (జీరో హార్మ్) ప్రమాద రహిత లక్ష్యాన్ని సాధించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. సింగరేణి సంస్థలో ప్రమాద రహిత పని వాతావరణాన్ని కల్పించి, ప్రతి ఉద్యోగి సురక్షితంగా విధులు నిర్వహించేలా చేయడమే మరియు ఈ సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ముఖ్య లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం ఎం.గోవిందరావు, ఏజీఎం ఈ అండ్ ఎం రామకృష్ణ, ఏఐటీయూసీ కత్తెర్ల. రాములు, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు చిలక రాజయ్య, డీజీఎం ఆర్ జి-1జి.వి.విజయ్ కుమార్, జీవి టిసి మేనేజర్ జి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు.. పేద కుటుంబాలకు ప్రభుత్వ భరోసా!

- ఉసిరికాయలపల్లిలో నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

- సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాల అందజేత



కారేపల్లి, భద్రాద్రి న్యూస్ రాములు:
గ్రామీణ పేద కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి సమక్షంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

పేదల జీవితాలకు పింఛన్లే ఆర్థిక భరోసా

ఈ సందర్భంగా నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందించారు. పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వారికి పెన్షన్లు ఆర్థికంగా అండగా నిలుస్తాయని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరాలి

గ్రామంలో అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, లబ్ధిదారులు, సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ప్రజా సమస్యలపై సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ వినతి

- ఉమ్మడి కుటుంబాల కుమారులకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో న్యాయం చేయాలి

- ఎల్-3 నుంచి ఎల్-1 జాబితాలోకి అర్హుల మార్పునకు విజ్ఞప్తి.. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు పీఎం కిసాన్ నిధులు అందించాలని అధికారులకు వినతిపత్రాలు



కారేపల్లి, భద్రాద్రి న్యూస్ రాములు:
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సింగరేణి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ పలు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన జాబితాల సమస్యతో పాటు అటవీ హక్కుల పట్టాలు పొందిన రైతులకు పీఎం కిసాన్ నిధుల నిలిపివేత అంశంపై సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఉమ్మడి కుటుంబాల కుమారులకు ఇందిరమ్మ ఇళ్లలో న్యాయం చేయాలి

గతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఉమ్మడి కుటుంబాలకు చెందిన కుమారులను సైతం ఎల్-3 జాబితాలో చేర్చడం వల్ల అర్హులైన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి కుటుంబంలో ఉన్నప్పటికీ వేరుగా జీవనం సాగిస్తున్న కుమారుల కుటుంబాల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించి నిబంధనల ప్రకారం ఎల్-3 జాబితా నుంచి ఎల్-1 జాబితాలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎంపీడీవో సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే గ్రామానికి వచ్చి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆర్ఓఎఫ్ఆర్ రైతులకు పీఎం కిసాన్ అందించాలి

2018 సంవత్సరం తర్వాత అటవీ హక్కుల చట్టం కింద ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులకు పీఎం కిసాన్ నిధులు నిలిచిపోయిన విషయాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. అటవీ హక్కుల పట్టాలు కలిగిన అర్హులైన రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా అందాల్సిన ఆర్థిక సహాయం అందకపోవడంతో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. సంబంధిత వివరాలను పరిశీలించి అర్హులైన రైతులకు పథకం ప్రయోజనాలు తిరిగి అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై వ్యవసాయ అధికారి స్పందిస్తూ సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందాలి ప్రభుత్వ పథకాల అమలులో అర్హులైన నిరుపేద కుటుంబాలు, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని భూక్య రంజిత్ కుమార్ కోరారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేతాజీ స్ఫూర్తితో యువతలో దేశభక్తి జ్వాలలు రగిలించాలి

- నవంబర్ 23 నుంచి జనవరి 23 వరకు రెండు నెలల పాటు పరాక్రమ చైతన్య యాత్ర

- నేతాజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

- యాత్రను జయప్రదం చేయాలని లోక్ రక్షక్ పార్టీ వ్యవస్థాపకులు కొండా చరణ్ పిలుపు



చర్ల, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్): భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, యువతలో దేశభక్తి స్ఫూర్తిని నింపడమే లక్ష్యంగా నేతాజీ పరాక్రమ చైతన్య యాత్ర చేపడుతున్నట్లు లోక్ రక్షక్ పార్టీ (ఎల్ఆర్పీ) వ్యవస్థాపకులు కొండా చరణ్ వెల్లడించారు. నేతాజీని స్మరించుకోవడం అంటే ఆయన చూపిన దేశభక్తి, త్యాగం, ధైర్యం, క్రమశిక్షణ వంటి విలువలను ఆచరణలో పెట్టడమేనని ఆయన స్పష్టం చేశారు. చర్ల మండలంలో నిర్వహించిన లోక్ రక్షక్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొండా చరణ్ మాట్లాడుతూ.. నేతాజీ సుభాష్ చంద్రబోస్ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని, దేశం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన అపార ధైర్యసాహసాల ప్రతీక అని కొనియాడారు. ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి బ్రిటిష్ పాలకులపై ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నేటి యువతకు నేతాజీ పోరాట చరిత్ర, దేశం పట్ల ఆయనకున్న అంకితభావం తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నేపథ్యంలో లోక్ రక్షక్ పార్టీ ఆధ్వర్యంలో 2026 నవంబర్ 23 నుంచి 2027 జనవరి 23 వరకు రెండు నెలల పాటు 'నేతాజీ పరాక్రమ చైతన్య యాత్ర' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ యాత్రలో భాగంగా వివిధ ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి నేతాజీ జీవిత చరిత్ర, ఆజాద్ హింద్ ఫౌజ్ పోరాట పటిమ, దేశభక్తి, త్యాగం, క్రమశిక్షణ, జాతీయ ఐక్యత వంటి అంశాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. యువతలో దేశం పట్ల బాధ్యత, సమాజం పట్ల సేవాభావం, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం పెంపొందించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. నేతాజీ ఆశయాలను కేవలం ప్రసంగాలకే పరిమితం చేయకుండా ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. 2027 జనవరి 23న నేతాజీ జయంతిని పురస్కరించుకుని 'పరాక్రమ్ దివస్' వేడుకలను ఘనంగా నిర్వహించి చైతన్య యాత్రను ముగించనున్నట్లు వెల్లడించారు. దేశభక్తి భావాలను ప్రజల్లో మరింత బలోపేతం చేసే ఈ యాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, దేశభక్తులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కొండా చరణ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు ఎస్.కె. జహూరుద్దీన్ భాష, మండల నాయకులు సిహెచ్. సుజాత, కూరపాటి స్వరూప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు

బ్రహ్మకుమారీస్ ఘన సన్మానం

- ప్రజలకు నిరంతరం సమాచారాన్ని చేరవేయడంలో పాత్రికేయుల సేవలు మరువలేనివి
- వైరా మండల పత్రికా మిత్రులను శాలువాలతో, మెమొంటుతో సత్కరించిన బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు









వైరా, నవంబర్ 16, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ పరిధి లో బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని పత్రికా మిత్రులకు సోమవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా మండల పరిధిలో వివిధ పత్రికలు, మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తించి వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో జరిగే ప్రతి సంఘటనను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక అంశాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.ఎండ, వాన, రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేస్తూ వార్తలను ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని కొనియాడారు. సమాజంలో మంచి మార్పు తీసుకురావడానికి పత్రికా రంగం చేస్తున్న కృషి ఎంతో గొప్పదని అన్నారు.జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులను సన్మానించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులోనూ వారు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సన్మానానంతరం గాయకుడు, జర్నలిస్టు మోదుగు గోవిందరావు ఆలపించిన పాట అందరిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, వైరా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం గ్రామస్తుల అవస్థలు.. పట్టించుకోని సింగరేణి అధికారులు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : సింగరేణి ప్రభావిత ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీకే సీఎం ఓపెన్‌కాస్ట్ గనికి అత్యంత సమీపంలో ఉన్న ప్రభావిత ప్రాంతమైన రుద్రంపూర్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ గత 15 రోజులుగా పని చేయడం లేదు. ఈ ప్లాంట్ ద్వారా రుద్రంపూర్‌తో పాటు గౌతంపూర్, ధన్‌బాద్, లక్ష్మీపురం తండా గ్రామాల ప్రజలతో పాటు సింగరేణి కార్యాలయాలకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తుంటారు. అయితే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ప్లాంట్ మూతపడింది. దీంతో ప్రజలు గత్యంతరం లేక బయట నుండి డబ్బులు వెచ్చించి తాగునీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్లాంట్‌ను వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని రుద్రంపూర్ సర్పంచ్ బానోత్ కేస్లీ, ఉప సర్పంచ్ తోట రాజు, పాలకమండలి సభ్యులు ఇప్పటికే వీకే సీఎం కోల్ మైన్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : చుంచుపల్లి మండల పరిధిలోని గౌతంపూర్ గ్రామ పంచాయతీలో ఆసరా పెన్షన్ల మంజూరులో అర్హులకు అన్యాయం జరుగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ల కోసం వంద మందికి పైగా దరఖాస్తులు సమర్పించగా, కేవలం 15 మందికి మాత్రమే మంజూరు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం గౌతమ్‌పూర్ ఎంపీడీవోకు స్థానిక బిజెపి నాయకులు సొప్పరి క్రాంతి, పలువురు గౌతమ్‌పూర్ వాసులు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా సదరం ధ్రువీకరణ పత్రాల్లో 80 నుండి 100 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు సైతం పెన్షన్లు మంజూరు కాకపోవడం బాధాకరమన్నారు. తీవ్ర వైకల్యంతో జీవనం సాగిస్తూ పెన్షన్లపై ఆధారపడాల్సిన వారికి కూడా ఆర్థిక భరోసా అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించి, నిజమైన అర్హులను గుర్తించి పెన్షన్లు మంజూరు చేయాలని అధికారులను వారు కోరారు.

ప్రజల పన్నుల డబ్బుతోనే సంక్షేమ పథకాలు

- ఘట్‌కేసర్‌లో నూతన పింఛన్ల ప్రాసీడింగ్స్ పంపిణీ
- లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన ప్రజాప్రతినిధులు
- ఆరేళ్లుగా నిలిచిన పింఛన్లు ఇప్పటికైనా అందడం సంతోషకరం
- డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని డిమాండ్
- చేయూత పింఛన్ల పంపిణీలో ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు..



ఘట్‌కేసర్, నవంబర్ 16 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ప్రాసీడింగ్స్ పంపిణీ కార్యక్రమం ఘట్‌కేసర్‌లోని బంధన్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి పాల్గొన్నారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ మనూ చౌదరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ..గత ఆరు,ఏడు సంవత్సరాలుగా పింఛన్లు నిలిచిపోయిన కొందరు లబ్ధిదారులకు ఇప్పటికైనా తిరిగి పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమని అన్నారు. దీర్ఘ కాలంగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ఈ నిర్ణయం కొంత ఊరటనిస్తుందని పేర్కొన్నారు. పింఛన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, జీవనోపాధికి ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితుల్లో ఉన్నవారికి భరోసా కల్పించే పథకమని అభిప్రాయ పడ్డారు. కొత్తగా పింఛన్లు పొందుతున్న మహిళలు, దివ్యాంగులకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలపై మాట్లాడిన ఈటల రాజేందర్..పింఛన్లు ఎవరు ఇచ్చినా అవి ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా సమకూరిన డబ్బేనని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వసూలయ్యే పన్నులతోనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని,ఆ నిధులను తిరిగి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నారని వివరించారు. ఏ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసినా,సంక్షేమ పథకం అమలు చేసినా అది ప్రజల సొమ్ముతోనే జరుగుతుందని అన్నారు. ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలను ఎవరో వ్యక్తిగతంగా తమ సొంత డబ్బు నుంచి ఇస్తున్నట్లు భావించకూడదని వ్యాఖ్యానించారు. అభివృద్ధి పనుల ప్రస్తావనకు వస్తూ.. ప్రాంతంలో వంతెన నిర్మాణం కోసం రూ.105 కోట్ల విలువైన ప్రభుత్వ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకొచ్చినట్లు ఈటల రాజేందర్ తెలిపారు. ఈ నిర్మాణానికి కేటాయించే నిధులు కూడా ప్రజలు చెల్లించిన పన్నుల నుంచే సమకూరుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడం ప్రభుత్వాల బాధ్యత అని, ప్రజాధనాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించాల్సిన అవసరం ఉందని అన్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పడటంతో పాటు ప్రాంత అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంకా మిగిలి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానిక అర్హులైన నిరుపేదలకే కేటాయించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న స్థానిక కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, కేటాయింపుల విషయంలో అర్హతకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. పింఛన్లు, ఇళ్లు మౌలిక వసతులు వంటి ప్రజా అవసరాల విషయంలో ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పింఛన్ ప్రొసీడింగ్స్ అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కార్యాలయం వేదిక కావాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్కతుర్తిలో మండల కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం
- ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలి
- మండలంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం



హనుమకొండ, నవంబర్ 16

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పనిచేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేసే వేదికగా పార్టీ కార్యాలయం నిలవాలని సూచించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందేలా ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎల్కతుర్తి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రహదారుల నిర్మాణం, ఆసుపత్రి,కోర్టు,బస్టాండ్, 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం వంటి కీలక పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ అభివృద్ధి సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రి వెల్లడించారు. గ్రామాల అవసరాలను గుర్తించి రహదారులు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు అన్ని ప్రాంతాలకు చేరేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో కాంగ్రెస్ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాల సమాచారం అందించడంతో పాటు వాటి అమలులో ఎదురయ్యే సమస్యలను గుర్తించాలని అన్నారు.

మహిళా సమాఖ్య మహాసభలను విజయవంతం చేయాలి

గడపగడపకు వెళ్లి మహిళలను ఆహ్వానించాలి: ఎస్కే సాబీర్ పాషా





కొత్తగూడెం
నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) : భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా, మూడో రాష్ట్ర మహాసభలను సమష్టి కృషితో ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ.. మహాసభల ప్రాధాన్యతను, మహిళా సమాఖ్య ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. గడపగడపకు వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఆత్మీయంగా మహాసభలకు ఆహ్వానించాలని, ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేసి మహిళలను పెద్ద సంఖ్యలో సమీకరించాలని సూచించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ.. మహిళల భాగస్వామ్యం లేనిదే ఏ ఉద్యమమూ విజయవంతం కాలేదన్నారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల నిర్వహణపై పలు సూచనలు చేశారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి మాట్లాడుతూ.. రాబోయే జిల్లా, రాష్ట్ర మహాసభలను అందరి సహకారంతో విజయవంతం చేస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో మహిళలను చైతన్యపరిచి పెద్ద సంఖ్యలో సమీకరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. మహిళల హక్కుల సాధన కోసం ఎన్ఎఫ్ఐడబ్ల్యు నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు, సర్పంచులు, మహిళా సంఘం నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.